

బాధ్యతగా అభివృద్ధి.. సంక్షేమం

ప్రజలు ఆశీర్వదిస్తే బాధ్యతగా పనిచేస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తానని తుడా చైర్మన్ తెలిపారు. - 8లో



శోభాయమానం.. సర్వభూపాలం

శ్రీనివాసమంగాపురంలో శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. - 8లో



పకడ్బందీగా ఎన్నికల ప్రక్రియ

నిబంధనల మేరకు ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీ శ ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

ఎస్పీగా కృష్ణకాంత్ పటేల్

తిరుపతి క్రైమ్ : తిరుపతి జిల్లా ఎస్పీగా కృష్ణకాంత్ పటేల్‌ను నియమిస్తూ చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న మలికా గార్గ్‌ను సీఐడీ ఎస్పీగా బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం విజయవాడ లా అండ్ ఆర్డర్ డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న కృష్ణకాంత్ పటేల్ త్వరలోనే తిరుపతి ఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీ శ ఆదివారం తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. అర్జీలు రాసేందుకు ప్రత్యేకంగా ముగ్గురు వీఆర్‌ఓలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్పందనకు అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 29 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 70,442 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 30,867 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.60 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

వెబ్‌సైట్‌లో 'పది' హాల్‌టికెట్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : పదోతరగతి పరీక్షలు ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న నేపథ్యంలో రాష్ట్ర విద్యాశాఖ సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతోంది. ఆదివారం ఈ మేరకు డీఈఓ శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ హాల్ టికెట్‌ను 'డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బీఎస్‌ఈ.ఏపీ.జీఓవి.ఇన్' వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

నేడు 'ఆధ్యాత్మిక శోభా యాత్ర'

తిరుపతి రూరల్ : శ్రీనివాస మంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీవారు గరుడవాహనంపై ఊరేగనున్నారు. ఈనేపథ్యంలో ఆనవాయితీ ప్రకారం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం తరఫున పట్టు వస్త్రాలు తీసుకుని శోభాయాత్రగా వెళ్లి శ్రీవారికి సమర్పించనున్నారు. ఈ మేరకు సోమవారం ఉదయం 6 గంటలకు తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పట్టు వస్త్రాలు, ఆండాళ్ మాలకు ప్రత్యేక పూజలు చేసిన తర్వాత ఆధ్యాత్మిక శోభాయాత్రను ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి దంపతులతో పాటు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, వేలాది మంది భక్తులు సారెను తీసుకుని ఆలయం వద్దకు చేరుకోనున్నారు. సోమవారం ఉదయం 7 గంటలకు పేరూరు, 9 గంటలకు వెంకటపతినగర్, 9.45 గంటలకు చెర్లోపల్లె, 10.15 గంటలకు పుదిపట్ల , 11 గంటలకు పెరుమాళ్లపల్లె, 11.45 గంటలకు సి.మల్లవరం, మధ్యాహ్నం 12 గంటలకు బీఎస్‌ఆర్ కల్యాణ మండపానికి చేరుకుంటారు. మధ్యాహ్న భోజనం అనంతరం 2 గంటలకు బయలుదేరి సాయంత్రం 3గంటలకు శ్రీనివాస మంగాపురం ఆలయం వద్దకు చేరుకుని పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

ఈ ఐదేళ్ల కాలంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు... నవరత్నాలతో పేదల సంతోషాలు.. ఇవన్నీ ఆ నేతలకు కంటగింపుగా మారినట్టుంది. ప్రజారంజకంగా సాగుతున్న జగనన్న పాలనలో ఇమడలేకపోయారు. రాజకీయ అనుభవాలను రంగరించుకుని చెలరేగిపోయేందుకు కొందరు యత్నించి చతికిలపడ్డారు. మరికొందరు వైఎస్సార్‌సీపీ చరిష్మాతో కొత్తగా వచ్చిన పదవిని సద్వినియోగం చేసుకోలేకపోయారు. ప్రజాసేవను విస్మరించి కేవలం స్వార్థరాజకీయాల కోసమే పరితపించారు. తమకు గుర్తింపునిచ్చిన పార్టీని వీడాలని నిశ్చయించుకున్నారు. మేకవన్నె పులుల్లా తమ గెలుపునకు పనిచేసిన నేతలు, కార్యకర్తలకు ద్రోహం చేస్తూ. ప్రత్యర్థి పార్టీలకు మంచి చేయడం ప్రారంభించారు. ఈ నాటకాలను గుర్తించిన అధిష్టానం ఉమ్మడి జిల్లాలో ఐదుగురు ఎమ్మెల్యేలను పక్కనబెట్టింది. దీంతో నిజమైన కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పార్టీకి పెనుభారమైన వారు బయటకెళ్లడంతో ఆనందంలో మునిగితేలుతున్నారు.



కక్షగట్టి.. ముప్పతిప్పలు పెట్టి

ఎమ్మెల్యేలు అయ్యాక ఆనం రామనారాయణరెడ్డి, ఆదిమూలం, ఆరణి శ్రీనివాసులు, వరప్రసాద్, ఎంఎస్ బాబు తమ విజయం కోసం పనిచేసిన వైఎస్సార్‌సీపీ శ్రేణులను పక్కన పెట్టేశారు. అంతేగాకుండా వారిపై కక్షగట్టి ముప్పుతిప్పలు పెట్టారు. తమ ఓటమి కోసం పనిచేసిన ఇతర పార్టీల వారిని పిలిచి మరీ పక్కన పెట్టుకుని రాక్షసానందం పొందారు. చివరకు వీరు ప్రజాసేవ చేయకుండా, స్వార్థ ప్రయోజనాల కోసం పనిచేయడంతో ప్రజల్లో వ్యతిరేకత పెరిగింది. ప్రజాభిమానాన్ని చూరగొనలేని ఆ ఐదుగురి స్థానంలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్తగా ఇన్‌చార్జ్‌లను నియమించారు.

వీళ్లింతే!



- గెలుపు కోసం పనిచేసిన వారిని ఇబ్బంది పెట్టారు
- ఓటమి కోసం పనిచేసిన వారిని పక్కన పెట్టుకున్నారు
- ఆ ఎమ్మెల్యేలకు దూరంగా ఉన్న శ్రేణులంతా హ్యాపీహ్యాపీ
- పార్టీకి నమ్మకద్రోహం చేసిన ఎమ్మెల్యేలంతా అజ్ఞాతంలోకి వెళుతున్న వైనం

సాక్షి, తిరుపతి:ఎలాంటి గుర్తింపూ లేని వారు కొందరికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలిచిమరీ టిక్కెట్లు ఇచ్చారు. గత రాజకీయ అనుభవాలు ఉన్న నేతలు మరింత ఎదగాలని, వారి అనుభవాలను పంచుకోవాలని చేయిపట్టుకుని నడిపారు. గత ఎన్నికల్లో అన్నీ తామై ఎమ్మెల్యేలుగా గెలిపించుకున్నారు. ఆ తర్వాత ప్రజారంజక పాలన కోసం ఎప్పటికప్పుడు ప్రజలతో మమేకమవ్వాలని సూచనలు చేశారు. అందుకోసమే గడపగడపకు మన ప్రభుత్వం, మీ ఊరికి మీ ఎమ్మెల్యే.. అంటూ పలు పథకాలకు శ్రీకారం చుట్టారు. సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందాలని ఆదేశాలు జారీచేశారు. ప్రతి నెలా అనేక సంక్షేమ కార్యక్రమాలు.. వారోత్సవాలకు సంసిద్ధం చేశారు. అదేకోవలో కార్యకర్తలు, నేతలను కలుపుకుపోయి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆదేశాలు జారీచేశారు. తరచూ ఎమ్మెల్యేలతో సమావేశాలు నిర్వహిస్తూ ప్రజల ఇబ్బందులు.. సమస్యలు.. సంక్షేమ పథకాలపై దిశానిర్దేశం చేశారు. కానీ అవేవీ ఆ నేతలకు చెవికెక్కలేదు. తమ స్వార్థ రాజకీయాల కోసం పక్క పార్టీల వైపు చూసి తప్పటడుగులు వేస్తున్నారు... ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని చిత్తూరు, పూతలపట్టు, గూడూరు, వెంకటగిరి, సత్యవేడు ఎమ్మెల్యేలు. ఇప్పుడు అక్కడా తమకు సరైన గుర్తింపులేదని కొందరు.. ఎలాగైనా చక్రం తిప్పొచ్చని మరికొందరు ఊహాలోకాల్లో తేలుతున్నారు. ఇలాంటి నేతలు బయటకు వెళ్లడమే మంచిదని కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్వార్థం..తప్పదు అజ్ఞాతం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిష్మాతో 2019లో ఎమ్మెల్యేలుగా గెలుపొందిన వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్, పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ప్రజలకు సేవచేయలేక, నమ్మిన వారికి వెన్నుపోటు పొడిచి ఇతర పార్టీల్లో చేరేందుకు ప్రయత్నిస్తున్నారు. తల్లిలాంటి పార్టీ దగ్గర ఛీకొట్టించుకుని ఇప్పుడు టీడీపీ, జనసేన నాయకుల కాళ్లవేళ్లా పడుతున్నారు. వైఎస్సార్‌సీపీపై బురదజల్లేందుకు ఎదురుచూస్తున్న ప్రతిపక్ష పార్టీ నేతలు ముందుగా వారికి మాయమాటలు చెబుతున్నారు. వైఎస్సార్‌సీపీ, ఆ పార్టీ ప్రజాప్రతినిధులపై విమర్శలు చేయిస్తున్నారు. ఇటువంటి అవకాశం కోసమే ఎదురుచూస్తున్న టీడీపీ, జనసేన అధినేతలు ఆ ఎమ్మెల్యేల ద్వారా పబ్బం గడుపుకున్నాక టికెట్ కేటాయింపు విషయంలో పేచీపెడుతున్నారు. పొత్తులో భాగంగా బాబు, పవన్ ఒకరికి తెలియకుండా ఒకరు అన్నట్టు సీట్లు ప్రకటించేస్తున్నారు. మరికొన్ని చోట్ల కిమ్మకనకుండా నమ్మకద్రోహులైన ఎమ్మెల్యేలను మరింత దూరం పెడుతున్నారు. వారి అసలు రంగు బయటపడడంతో తప్పుచేశాం.. అని తన ముఖ్య అనుచరుల వద్ద కొందరు ఎమ్మెల్యేలు మథనపడుతున్నారు. మరికొందరు తమను నమ్ముకున్న ప్రజలకు ముఖం చూపించలేక అజ్ఞాతంలోకి జారుకుంటున్నారు.

గుచ్చుకుంటున్న పక్కచూపులు !

ఆడలేనమ్మ మద్దెల ఓడు అన్నట్టు ప్రజారంజక పాలనలో ఇమడలేని నమ్మకద్రోహులైన ఎమ్మెల్యేలు మొదట టీడీపీ నేతలతో టచ్‌లోకి వెళ్లారు. అక్కడి నుంచి సరైన స్పందన లేకపోవడంతో జనసేన అధినేతను కలిశారు. ఆ తర్వాత టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను ప్రకటిస్తున్న నేపథ్యంలో ఆనం మినహా మిగిలిన ఎమ్మెల్యేలంతా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. చిత్తూరు టీడీపీ అభ్యర్థిగా ఎన్‌ఆర్‌ఐ గురజాల మోహన్‌ను ప్రకటించడంతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కొన్ని రోజుల పాటు అజ్ఞాతంలోకి వెళ్లారు. ఎలాగూ పార్టీ పొత్తులో భాగంగా జనసేనలో ఉంటే చక్రం తిప్పవచ్చన్న ఉద్దేశంతో ఆదివారం ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌ను హైదరాబాద్‌లో కలిశారు. తిరుపతి అభ్యర్థిగా ప్రకటించమని వేడుకున్నట్టు తెలిసింది. ఎన్నికల తర్వాత అయినా పార్టీలో కీలక పదవి ఇప్పించమని ప్రాధేయపడినట్టు ప్రచారం జరుగుతోంది. నమ్మక ద్రోహులు వెళ్లిపోవడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

పల్స్‌పోలియో విజయవంతం

- జిల్లాలో 98.1 శాతం మందికి పోలియో చుక్కలు



పోలియో చుక్కలు వేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

తిరుపతి తుడా/రేణిగుంట : పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. డిప్యూటీ సీఎం నారాయణస్వామి రేణిగుంట మండలం వెదుళ్లచెరువు ఎస్టీ కాలనీలో కలెక్టర్ లక్ష్మీశతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తిరుపతిలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పిల్లలకు పోలి యో చుక్కలు వేశారు.జిల్లా వ్యాప్తంగా 98.1 శాతం మందికి పోలియో చుక్కలు వేసినట్టు డీఎంహెచ్‌ఓ శ్రీహరి తెలిపారు. మొత్తం 0–5 పిల్లలు 2,53,282 మంది ఉండగా అందులో మొదటి రోజే 2,48,604 మందికి పోలియో చుక్కలు వేసినట్టు వెల్లడించారు. అందుబాటులో లేని పిల్లల కోసం మరో రెండు రోజులు పల్స్ పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. పల్స్‌పోలియో రాష్ట్ర నోడల్ అధికా రి రమాదేవి, డీఎంహెచ్‌ఓ శ్రీహరి, జిల్లా టీబీ నియంత్రణ అధికారి సులోచనాదేవి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి శ్రీనివాసరెడ్డి, డీఈఓ శేఖర్, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి జయలక్ష్మి, డీఎల్‌పీఓ ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు : గుడిమల్లం పరశురామేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నేతలు బియ్యపు పవిత్రారెడ్డి, కిషోర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ నరసింహ యాదవ్ పాల్గొన్నారు.

భక్తుడికే తొలి పూజ!

- కనులపండువగా కన్నప్ప ధ్వజారోహణం
- శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



ధ్వజస్తంభానికి హారతి సమర్పిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు కన్నప్ప ధ్వజారోహణంతో కనులపండువగా ప్రారంభమయ్యాయి. ఆదివారం సాయంత్రం ముందుగా కన్నప్ప ఉత్సవమూర్తికి అభిషేకం చేసి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ కొండపైకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. కన్నప్ప ఆలయం వద్ద ఉత్సవమూర్తిని కొలువుదీర్చి శాస్త్రోక్తంగా గణపతిపూజ, పుణ్యాహవచనం, మండప ఆరాధన, ధ్వజ పూజ నిర్వహించారు. ముక్కోటి దేవతలకు సంకల్ప పూజతో ఆహ్వానం పలికారు. ధ్వజపతాకాన్ని ఎగురవేసి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. కన్నప్ప ఉత్సవమూర్తిని తిరిగి కిందకు తీసుకువచ్చి ముక్కంటి ఆలయం వద్ద బోయ కులస్తులు ఏర్పాటు చేసిన మండపంలో కొలువు దీర్చారు. అనంతరం మాడ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం రాత్రి వాస్తుశాంతి పూజలు జరిపించారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు, బియ్యపు పవిత్రారెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న కళారూపాలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కళారూపాలను భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

బోయల తొలి ఉభయం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆనవాయితీ ప్రకారం ఆదివారం బోయ కులస్తులు మొదటి ఉభయం నిర్వహించారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

ఆగమోక్తంగా అంకురార్పణ

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రాత్రి ఆగమోక్తంగా అంకురార్పణ పూజలు చేశారు. వేదపండితులు శాస్త్రోక్తంగా ఈ పూజలను నిర్వహించారు. ఎలాంటి అవాంతరాలు లేకుండా సాగాలని పూజలుచేశారు.



కన్నప్ప ఆలయం ఎదుట ఉత్సవమూర్తికి పూజలు



అంకురార్పణ చేస్తున్న వేదపండితులు

చరిత్రలో నిలిచేలా సంక్షేమం



సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : ప్రపంచ రాజకీయ చరిత్రలోనే నిలిచేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, పారదర్శకంగా ప్రజల ఖాతాల్లో రూ. 3.40లక్షల కోట్లు జమ చేశారని టీటీడీ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. ఆదివారం తిరుమల బైపాస్‌రోడ్డులోని టీఎంఆర్ కల్యాణ మండపంలో కార్పొరేటర్లు దొడ్డారెడ్డి ప్రతాప్‌రెడ్డి, దొడ్డారెడ్డి ప్రవల్లికారెడ్డితోపాటు దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ నిత్యం ప్రజాక్షేమాన్ని ఆలోచించే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే తిరుపతి అభివృద్ధి, బావితరాల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని భూమన అభినయ్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఈ ఎన్నికలు తిరుపతి అభివృద్ధికి ఎంతో కీలకమైనవని తెలిపారు. ప్రభుత్వం పథకాల ద్వారా ఒక్క తిరుపతిలోనే సుమారు రూ.2 వేల కోట్లు మహిళల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. జగనన్న తిరుపతిలోని పేదలకు 26,500 ఇంటి స్థలాలు ఇచ్చారని, మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటే ఇళ్లు నిర్మించి ఇస్తారని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పుట్టి పెరిగిన వ్యక్తిగా ఈ గడ్డపై ఎంతో మమకారం ఉందని, అవకాశం కల్పిస్తే మరింత శ్రద్ధతో అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 17 మాస్టర్ ప్లాన్ రోడ్లు, ఫ్రీ లెఫ్ట్‌లు, స్లిప్ వేలు వేశామని వివరించారు. సమావేశంలో మేయర్ శిరీష, డిప్యూటి మేయర్ ముద్రనారాయణ, పార్టీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి, నేతలు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, ఎం.సునీల్ చక్రవర్తి, వెంకటేష్ రాయల్, మద్దాలి శేఖర్, గురవారెడ్డి, రూపేష్‌రెడ్డి, శ్రీదేవి, దూది కుమారి, విజయలక్ష్మి, లక్ష్మీరాజ్యం, తలారి రాజేంద్ర, గోపాల్‌రెడ్డి, సాయికుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

ఆడపడుచుల అభ్యున్నతికే 'ఆసరా'



లబ్ధిదారులకు మెగా చెక్ అందిస్తున్న ఎంపీ గురుమూర్తి, సమన్వయకర్త రాజేష్

వరదయ్యపాళెం : ఆడపడుచుల అభ్యున్నతికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకం అమలు చేస్తున్నట్లు ఎంపీ గురుమూర్తి తెలిపారు. ఆదివారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఆసరా చెక్‌ల పంపిణీ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన జగనన్నకే నారీ లోకం అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఒక్క సత్యవేడు నియోజకవర్గంలోనే ప్రజలకు 28 పథకాల ద్వారా రూ.1,400కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. వరదయ్యపాళెం మండలంలో నాలుగో విడత ఆసరా పథకం కింద 857 గ్రూపులకు రూ.7.42 కోట్లు అందించినట్లు వివరించారు. నూకతోటి రాజేష్ మాట్లాడుతూ గతంలో చంద్రబాబు చేసిన మోసాలు ప్రజలకు ఇంకా గుర్తున్నాయన్నారు. రుణమాఫీ, సున్నావడ్డీ అంటూ పొదుపు మహిళలను నట్టేట ముంచారని విమర్శించారు. అదే జగనన్న ప్రభుత్వం ఒక్క వరదయ్యపాళెం మండలంలోనే గడిచిన నాలుగేళ్లలో వైఎస్సార్ ఆసరా పథకం కింద పొదుపు మహిళలకు రూ. 29.67కోట్లు అందించారని వెల్లడించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, వైస్ ఎంపీపీ శ్యామలమ్మ, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బందిల సురేష్, వక్ఫ్ బోర్డు జిల్లా కార్యదర్శి లతీఫ్, స్థానిక నేత భానుప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముక్కంటికి కూరగాయల వితరణ



ఈఓకు కూరగాయలను అందజేస్తున్న దాత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నిత్యాన్నదానంలో వినియోగించుకునేందుకు నంద్యాలకు చెందిన ప్రసాద్ అనే భక్తులు ఆదివారం 25 టన్నుల కూరగాయలు వితరణగా అందించారు. ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు ఈ మేరకు కూరగాయలను స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దాత మాట్లాడుతూ పరమేశ్వరుని కృపాకటాక్షంతో తమ కుటుంబం చల్లగా ఉందని, వ్యాపారం అభివృద్ధి చెందిందని తెలిపారు.

ఏపీపీ శ్రీదేవి పదవీకాలం పొడిగింపు



ఏపీపీ చెవిరెడ్డి శ్రీదేవి

తిరుపతి లీగల్: తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉన్న చెవిరెడ్డి శ్రీదేవి పదవీ కాలాన్ని మరో మూడేళ్ల పాటు పొడిగిస్తూ రాష్ట్ర హోం శాఖ ఉత్తర్వులు జారీచేసింది. గత మూడేళ్లుగా తిరుపతి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏపీపీగా ఆమె విధులు నిర్వహిస్తున్నారు. అలాగే రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ల అసోసియేషన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆమె మీడియాకు తెలిపారు.

బాధ్యతగా అభివృద్ధి.. సంక్షేమం



తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి ఆత్మీయ స్వాగతం పలుకుతున్న మహిళలు

పాకాల : నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తానని వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని ఈ–పాలగుట్టపల్లె పంచాయతీ లక్ష్మీపురంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా కొమ్మిరెడ్డిగారిపల్లె నుంచి వరదప్ప నాయుడుపేట, వెంకటరామాపురం మీదుగా లక్ష్మీపురం వరకు స్థానిక నేతలు, కార్యకర్తలు బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. అనంతరం మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆప్యాయతా, అనురాగాలను చూస్తుంటే తమ సొంత గ్రామానికి వచ్చినట్లు ఉందన్నారు. ముఖ్యమంత్రి జగనన్న గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చారని, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. జగనన్న నాయకత్వంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని వెల్లడించారు. ముఖ్యంగా విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా ఉన్నారని గుర్తు చేశారు. హిందువులకు సంక్రాంతి కానుక, ముస్లింలకు రంజాన్ తోఫా, క్రైస్తవులకు క్రిస్మస్ కానుక, వధూవరులకు ఎమ్మెల్యే పెళ్లి కానుకను అందజేస్తున్నానని వివరించారు. మెడికల్ క్యాంపులు నిర్వహించి వైద్య సేవలు అందించారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ సభ్యుడు నంగా పద్మజారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లివేడు విక్రమ్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మునీశ్వర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ లింగయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు పులి కేశవమూర్తి రెడ్డి, రఘుపతి, డివిజన్ అధ్యక్షుడు హరిప్రసాద్ రెడ్డి, కపిలేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, సర్పంచ్ సిద్ధారెడ్డి, మాజీ సర్పంచ్ నాగరాజానాయుడు, చంద్ర, స్థానిక నేతలు రామలింగారెడ్డి, కేశవులరెడ్డి, హేమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మోహిత్‌రెడ్డికి వెంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరిస్తున్న నాయకులు



బైక్ ర్యాలీలో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

సింహ వాహనంపై సోమస్కంధమూర్తి



సింహవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం రాత్రి సింహవాహనంపై కామాక్షి సమేతంగా శ్రీసోమస్కంధమూర్తి పురవీధుల్లో విహరిరించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామి వారి సింహ వాహన సేవ వేడుకగా సాగింది. గజరాజులు ముందు నడుస్తుండగా కళాబృందాల భజనలు, కోలాటాల నడుమ స్వామి వారి చంద్రప్రభ వాహన సేవను కోలాహలంగా చేపట్టారు. అడుగడుగునా భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలు అందించారు. కాగా ఉదయం స్వామివారు భూత వాహనంపై వైభవంగా ఊరేగారు. అనంతరం ఆలయ ఆవరణలోని మండపంలో స్నపన తిరుమంజనం వేడుకగా చేపట్టారు. సోమవారం ఉదయం మకరవాహనం, రాత్రి శేష వాహనంపై స్వామివారు ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ జి.దేవేంద్రబాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, అర్చకులు స్వామినాథ గురుకుల్, ఉదయ గురుకుల్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ పాల్గొన్నారు.



భూత వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షిస్తున్న ఆది దంపతులు

తిరుమలలో వేసవి వసతులు

తిరుమల : శ్రీవారి భక్తుల సౌకర్యార్థం టీటీడీ తిరుమలలో పందిళ్లు ఏర్పాటు చేసింది. పెరుగుతున్న ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అలిపిరి నడక మార్గం రోడ్డు పక్కన పందిళ్లు వేయించింది. శ్రీవారి ఆలయం నుంచి వెలుపలికి వచ్చిన భక్తులు ఇబ్బంది పడకుండా తిరుమాడ వీధుల్లో నిరంతరం నీళ్లు చల్లిస్తోంది.

మాడవీధుల్లో నీరు చల్లుతున్న సిబ్బంది





నడక మార్గంలో ఏర్పాటు చేసిన పందిళ్లు

శోభాయమానం.. సర్వభూపాలం



సర్వభూపాల వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

చంద్రగిరి : శ్రీనివాస మంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా సాగుతున్నాయి. నాలుగోరోజు ఆదివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారు సర్వభూపాల వాహనంపై శోభాయమానంగా మాడ వీధుల్లో విహరించారు. అడుగడుగునా భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలో ఉదయం కల్యాణ వెంకన్న శ్రీరాజమన్నార్ అలంకరణలో చంద్రకోలు, దండం ధరించి కల్పవృక్షవాహనంపై దర్శనమిచ్చారు. ఉభయ దేవేరీ సమేతంగా ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. సాయంత్రం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవను వైభవంగా నిర్వహించారు. అనంతరం రాత్రి దేవదేవేరులు సర్వభూపాల వాహనంపై కొలువుదీరి వృషభ, అశ్వ, గజరాజులు ముందు నడుస్తుండగా, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాల నడుమ విహరించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మీ, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్లు చెంగల్రాయులు, వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

నేడు గరుడ సేవ



కల్పవృక్షవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారికి అత్యంత ప్రీతిపాత్రమైన గరుడ వాహనంపై సోమవారం రాత్రి 7 గంటల నుంచి 8.30 గంటల వరకు ఊరేగనున్నారు. అంతకుముందు మోహినీ అవతారంలో పల్లకిపై విహరిస్తూ భక్తులను సమ్మోహితులను చేయనున్నారు. ఈ మేరకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

లక్ష్మీహారం శోభాయాత్ర

సోమవారం గరుడ సేవను పురస్కరించుకుని శ్రీవారికి లక్ష్మీహారాన్ని అలంకరించనున్నారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం నుంచి శోభాయాత్రగా లక్ష్మీహారాన్ని, గోవిదరాజస్వామి వారి ఆలయం నుంచి ఆండాళ్ అమ్మవారి పూలమాలలు ఊరేగింపుగా శ్రీనివాసమంగాపురం తీసుకురానున్నారు.


పకడ్బందీగా ఎన్నికల ప్రక్రియ



ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి అర్బన్ : ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పకడ్బందీగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ లక్ష్మీ శ స్పష్టం చేశారు. ఆదివారం తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో అధికారులకు ఓటింగ్ యంత్రాల నిర్వహణపై చేపట్టిన శిక్షణ తరగతులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది ముందుంగా ఓటింగ్ యంత్రాలపై అవగాహ పెంపొందించుకోవాలని సూచించారు. ప్రధానంగా సెక్టోరల్ అధికారులు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలపై పట్టు సాధించాలని కోరారు. ఈవీఎం కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్ వాడకంపై మరింత శిక్షణ పొందాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఆర్ఓ నిషాంత్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాలను కలెక్టర్ సందర్శించారు. పెండింగ్ ఫామ్స్‌ను పరిష్కరించాలని చెప్పారు. మృతులు, వలస వెళ్లిన వారి ఓట్లను బీఎల్ఓలు సుమోటాగా తొలగించకూడదని స్పష్టం చేశారు. పక్కాగా ధ్రువీకరణ పత్రాలు తీసుకున్న తర్వాతే తొలగించాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ అదితీసింగ్ పాల్గొన్నారు.

సంఘటితంగా ముందుకెళ్దాం



మాట్లాడుతున్న ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామరాజు

గూడూరు రూరల్ : సమస్యల పరిష్కారానికి బ్రాహ్మణ సమాజం అంతా కలిసి సంఘటితంగా ముందుకెళ్దామని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజుగారి వెంకటరామరాజు పిలుపునిచ్చారు. గూడూరు పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య, ఆదిశంకరాచార్య బ్రాహ్మణ సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామరాజు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో బ్రాహ్మణ సమాజం ఎంతో సంఘటితంగా ముందుకెళుతోందన్నారు. శాసనసభ ఎన్నికల్లో బ్రాహ్మణులకు ప్రతి రాజకీయ పార్టీ కనీసం 10 సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆదిశంకరాచార్య బ్రాహ్మణ సేవా సంఘం గౌరవాధ్యక్షులుగా శ్రీకంటి రామ్మోహన్‌రావు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర నాయకులు వాసుదేవరావు, కామేశ్వర వరప్రసాద్, శివరామకబుష్ణ ప్రసాద్, ఆదిశంకరాచార్య బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు



ఘటనాస్థలంలో కారు

నాగలాపురం : మండలంలోని నందనం వద్ద పుత్తూరు–చెన్నై జాతీయ రహదారి పక్కన చెట్టును ఆదివారం ఓ కారు ఢీకొంది. వివరాలు.. చెన్నై కొరటూరుకు చెందిన భక్తులు తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లి తిరుగుప్రయాణంలో ఉండగా కారు అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. క్షతగాత్రులు నిర్మల (42), రోహిత్(16)ను 108లో నాగలాపురం పీహెచ్‌సీకి తరలించారు.

పూరిల్లు దగ్ధం



కాలిపోయిన పూరిల్లు

చిల్లకూరు : మండలంలోని నెలబల్లి రెట్టపల్లెలో ఆదివారం ఓ పూరిల్లు అగ్నికి ఆహుతైంది. వివరాలు.. గ్రామానికి చెందిన పసుపులేటి స్వామి ప్లాస్టిక్ బొమ్మలు చేసుకుని విక్రయించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి పూరింటికి అంటుకున్నాయి. గ్యాస్ సిలిండ్ బయటకు తీసుకువచ్చే క్రమంలో స్వామికి సైతం స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి మంటలు అదుపు చేసే సరికే ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లోని బొమ్మలు చేసే సామగ్రి కాలిపోయిందని, దీంతో సుమారు రూ.2లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. గాయపడిన స్వామిని 108లో గూడూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. వీఆర్ఓ భాస్కర్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

పోక్సో చట్టం కింద కేసు

సైదాపురం: 11 ఏళ్ల బాలికను బెదిరించి లైంగిక వేధింపులకు గురిచేసిన 40 ఏళ్ల వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ డీఎస్ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 11 ఏళ్ల బాలికను అదే గ్రామానికి చెందిన మస్తాన్‌బాషా (40) బెదిరించి బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక జరిగిన విషయాన్ని తల్లికి చెప్పడంతో గురువారం సైదాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు స్పందించి పోక్సో చట్టం కింద కేసును నమోదు చేసి నిందితుడ్ని అరెస్ట్ చేశారు.

కోడిపందెం స్థావరంపై దాడులు

దక్కిలి: మండలంలోని దగ్గవోలు సమీపంలో కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆదివాడం దక్కిలి ఎస్ఐ చౌడయ్య సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురు జూదరులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులు, రూ,1400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఏర్పేడు: మండలంలోని కొత్తకండ్రిగ సమీపంలోని పుష్పిత్ కంపెనీ వద్ద ఆదివారం అనుమానాస్పద స్థితిలో ఆర్అండ్‌బీ రోడ్డుపై గుర్తుతెలియని వ్యక్తి(45) మృతదేహం లభ్యమైంది. ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు కథనం.. మండలంలోని కొత్తకండ్రిగ సమీపంలోని పుష్పిత్ కర్మాగారం వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి స్థానికులు సమాచారాన్ని అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. తెల్ల బన్నియన్, ఎరుపు డ్రాయర్, పక్కన ప్యాంట్, వాటర్ బాటిల్‌తో మృతదేహం ఉండడంతో శనివారం రాత్రి మద్యం ఎక్కువ సేవించి మృతిచెందాడా..? ఏదైనా ప్రమాంద జరిగిందా..? అనే కోణంలో అనుమానాస్పద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. ఆచూకీ తెలిసిన వ్యక్తులు 9440900729 ఫోన్ నంబరుకు సమాచారం అందించాలన్నారు.